క్లుప్తంగా...

అస్సాం సీఎంకు ఘన స్వాగతం



హిమంతా బిశ్వ శర్మకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: నగరానికి వచ్చిన అస్సాం సీఎం హిమంతా బిశ్వ శర్మను బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఎయిర్‌పోర్టులో స్వాగం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో బీజేపీ ఓటమిపాలైన మాత్రాన ఏమీ ఒరిగేది లేదని, బీజేపీకి దేశంలో సుస్థిర స్థానం కలిగి ఉందన్నారు. బీజేపీతోనే దేశం అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్ రెడ్డి, పరమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు పర్యాటక శోభ



గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం పర్యాటక శోభను సంతరించుకుంది. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. వచ్చిన వారిలో యువకులు, యువ జంటలు ఎక్కువగా ఉండటం గమనార్హం. కాగా పర్యాటకులతో గోల్కొండ నగీనా బాగ్‌లో సందడి నెలకొంది. మరోవైపు యువ జంటలు నగీనా బాగ్ వద్ద గల అక్కన్న–మాదన్న కార్యాలయం వద్ద, ప్రధాన ద్వారం గల భారీ సైజు ఫిరంగుల వద్ద నిలబడి సెల్ఫీలు తీసుకున్నారు.

కర్ణాటకలో విజయం పట్ల హర్షం



రఫిక్ బేగ్

చాంద్రాయణగుట్ట: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ రెండు నెలలుగా ప్రార్థనలు నిర్వహించిన బాబానగర్‌కు సంఘ సేవకుడు మీర్జా రఫిక్ బేగ్.. ఫలితాల అనంతరం హర్షం వ్యక్తం చేశాడు. గతంలో ఏపీ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డితో పాటు 17 మందికి ఎన్నికల ముందు ఇలానే ప్రార్థనలు నిర్వహించి సఫలీకృతుడయ్యాడు. రెండు నెలల నుంచి ప్రతిరోజూ ఉదయం ఈ ప్రార్థనలు జరిపినట్లు ఆయన తెలిపారు. సెక్యూలర్ పార్టీల కోసం ముున్ముందు కూడా ఇలాంటి ప్రార్థనలు జరుపుతానని ఆయన తెలిపారు.

తానా కార్యాలయం ప్రారంభం

సుల్తాన్‌బజార్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కోఠిలోని ఐఎంఏ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని వినోద్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందు కోసం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీను మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. వైద్యం, ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ ప్రధాన ఎజెండాను ఆ దిశలోనే ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జీఎంఎస్ ప్రిన్సిపాల్ షమిలా రెడ్డి

అబిడ్స్: సమాజ సేవకు ఉచిత కంటి వైద్య శిబిరాలు దోహదపడుతాయని గౌతమ్ మోడల్ స్కూల్ ఆగాపురా ప్రిన్సిపాల్ షమిలారెడ్డి పేర్కొన్నారు. తరచూ తమ జీఎంఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సమాజ సేవలు చేస్తూ సమాజ అభివృద్ధికి, సమాజ సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఆదివారం ఆగాపురా పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం షమీలారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ వైద్య శిబిరంలో దాదాపు 200లకు పైగా మంది పాల్గొని వైద్య చికిత్సలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పోలీస్‌స్టేషన్ మళ్లీ తిరిగొస్తోంది..

- 1916 నాటి హెరిటేజ్ భవనంలోకే మరోసారి..
- బండ్లగూడకు కొత్త పోలీస్‌స్టేషన్
- ఈనెల 5న స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన సీపీ సీవీ ఆనంద్



హెరిటేజ్ భవనంలోకి తిరిగి తరలనున్న చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పాత పోలీస్‌స్టేషన్ భవనంలో మళ్లీ పోలీసు బూట్ల చప్పుళ్లు వినపడనున్నాయి. కుమ్మర్‌వాడి రహదారిలోని భవనంలో ఉన్న ఈ ఠాణాను 22 నెలల క్రితం బండ్లగూడలో సకల హంగులతో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. కాని ఈ ఠాణా తరలింపు సమయంలో చాంద్రాయణగుట్ట పరిసర ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సున్నితమైన ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని కుమ్మర్‌వాడీ, కేశవగిరి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఠాణా ముందు ధర్నా కూడా నిర్వహించారు. కాని అధికారులు అవేమి పట్టించుకోకుండా 2021 జూలై 24న నూతన భవనంలోకి తరలించారు. అప్పటి నుంచి ఆవేదనలో ఉన్న స్థానికులు తాజాగా పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. పాత భవనంలోకి తిరిగి చాంద్రాయణగుట్ట ఠాణాను తరలించేందుకు అధికారులు నిర్ణయించారు.

1916లో నిర్మించిన భవనం..

శ్రీశైలం రూట్‌లోని కుమ్మర్‌వాడీ రహదారిలో నిజాం నవాబుల హయాంలో 1916లో ఈ పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 105 ఏళ్ల పాటు ఈ హెరిటేజ్ భవనంలో పోలీసు సేవలు కొనసాగాయి. భవనం సరిపోవడం లేదన్న కారణంతో రెండేళ్ల క్రితం తరలించినప్పటికీ.. తాజాగా పరిపాలన సౌలభ్యం కోసం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పునర్విభజన చేస్తుండడంతో మరోసారి ఈ భవనంలో స్టేషన్ కొనసాగేందుకు అవకాశం దక్కింది. ఇందుకు సంబంధించిన చిన్నచిన్న మరమ్మతులు చకచకా కొనసాగుతున్నాయి. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఈనెల 5న స్టేషన్ ప్రాంగణాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ముహూర్తం ఖరారు కాకపోయినప్పటికీ ఈ నెలలోనే పోలీస్‌స్టేషన్ ప్రారంభం కానుందని పోలీస్ వర్గాలు తెలిపాయి.

రెండు పోలీస్‌స్టేషన్లు.. చాంద్రాయణగుట్ట, బండ్లగూడ

చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిని విభజించి బండ్లగూడ పేరుతో మరో కొత్త ఠాణాను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం బండ్లగూడలోని అధునాతన భవనంలో బండ్లగూడ పోలీస్‌స్టేషన్.. చాంద్రాయణగుట్టలోని పాత భవనంలో చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లు కొనసాగనున్నాయి. చాంద్రాయణగుట్ట పేరుతో నూతనంగా ఏర్పాటైన ఏసీపీ డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్లే కావడంతో పరిధిలోకి ఈ రెండు ఠాణాలతో పాటు కంచన్‌బాగ్ ఠాణాను కూడా పరిగణనలోకి తీసుకొని ఫైనల్ చేయనున్నారు.

కొత్త పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతను ముందే వివరించిన 'సాక్షి'


పాతబస్తీలో మరో కొత్త ఠాణాకు కసరత్తు

కొత్త పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతను రెండేళ్ల కిందటే వివరించిన సాక్షి కథనం

చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ను విభజించి కొత్తగా బండ్లగూడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను 'సాక్షి'దినపత్రిక 2021 జనవరి 4న 'పాతబస్తీలో మరో కొత్త ఠాణాకు కసరత్తు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పోలీస్‌స్టేషన్ పరిధి విశాలంగా ఉండడం.. ఇందులోనే బెంగళూరు, శ్రీశైలం హైవేలు సైతం ఉండడంతో ప్రమాదాల సంఖ్య కూడా ఎక్కువ సంఖ్యలో నమోదవుతుండడం. అరబ్ షేక్‌ల వ్యవహారాలు, భూ వివాదాలు, ఖాళీగా ఉన్న ప్రాంతం ఎక్కువగా ఉండడంతో రోజురోజుకూ కొనసాగుతున్న నిర్మాణాల సంఖ్యకు అనుగుణంగా జనాభా పెరుగుతుండంతో పోలీసులు పూర్తిస్థాయిలో సేవలందించలేని పరిస్థితిపై వివరించడం జరిగింది. అప్పటి డీసీపీ గజరావు భూపాల్ కూడా కొత్త ఠాణా ఏర్పాటు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించినప్పటికీ కార్యరూపం మాత్రం దాల్చలేదు. కాస్త ఆలస్యమైనప్పటికీ అధికారులు అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నారు.

శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించండి



మంత్రి తలసానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న తిరుమలేష్

చాంద్రాయణగుట్ట: ఇంద్రానగర్‌లోని శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని బేడ బుడగ జంగం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు ఆలేటి తిరుమలేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంద్రానగర్‌లోని శ్మశాన వాటికలో కనీస సదుపాయాలు కరువవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విద్యుద్దీపాలు, సీసీ రోడ్డు, ప్రహరీ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్పందించిన మంత్రి వెంటనే ఆయా పనులకు నిధులు మంజూరు చేసి ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌కు తన లెటర్ హెడ్‌ను పంపించారు.

విద్యతోనే ప్రగతి: ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ: విద్యతోనే ప్రగతి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. తల్లిని మించిన దైవం లేదని కొనియాడారు. తన చిన్నతనంలో పట్టుబట్టి మరీ తన తల్లి పాఠశాలకు పంపించడం వల్లే తాను ఎంతో మంచి స్థితికి చేరుకున్నానని తెలిపారు. మాజీ మంత్రి పుష్పలీల మాట్లాడుతూ.. బాలికల పట్ల ఎలా వ్యవహరించాలో అబ్బాయిలకు నేర్పించాలన్నారు. అనంతరం వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి మహాతి, ఫిట్‌నెస్ ట్రైనర్ అనుప్రసాద్, దుర్గమ్మ ఎల్లమ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకురాలు జయశ్రీ దుర్గమ్మ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్ సనా హోటల్, మేరాజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో డ్రైనేజీతో పాటు వర్షపునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. అయితే డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చివరి దశకు వచ్చాయన్నారు. పైప్‌లైన్ పనుల్లో కూడా వేగం పెంచామని, ఈ పనులను ప్రతినిత్యం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర డివిజన్లలో వరదనీటి పైప్‌లైన్ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లించడం జరిగిందని, మరికొన్ని చోట్ల ఈ పనుల వల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులున్నారు.

అమృతలత-అపురూప పురస్కారాల ప్రదానం



అభినందన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: అమృతలత-అపురూప పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి తెలుగు వర్సిటీలోని నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగింది. అమృతలత అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్టు డాక్టర్ శ్రీనివాస్, విశిష్ట అతిథిగా కేంద్ర సాహిత్య సలహా మండలి కన్వీనర్ డాక్టర్ సి.మృణాళిని హాజరై అవార్డులను అందజేశారు. అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను నవలా రచన విభాగంలో గంటి భానుమతి, విద్యా రంగంలో డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్, సినీ రంగంలో సంగీత, శాస్త్రీయ సంగీతంలో ద్వారం లక్ష్మికి ఒక్కొక్కరికి రూ.25 వేలు చెక్కుల రూపంలో నగదును ప్రదానం చేశారు. అలాగే అపురూప పురస్కారాలను మాణిక్యేశ్వరి (సినీ జర్నలిజం), ఆలపాటి లక్ష్మి (రంగస్థలం), మందరపు హైమవతి (కవిత్వం), మహెజబీన్(మహిళాభ్యుదయం), జ్యోతి వలబోజు (పుస్తక ప్రచురణ), శైలజా మిత్ర(సాహితీ విమర్శ), డాక్టర్ కె.రత్నశ్రీ (శాస్త్రీయ నృత్యం), డాక్టర్ కె.ఎన్.మల్లీశ్వరి(కథా రచన), పి.జ్యోతి(వ్యాసరచన) విభాగాలలో ఒక్కొక్కరికి రూ.10వేలు అందజేశారు. అంతకు ముందు అతిథులు, అవార్డు గ్రహీతలకు సంబంధించిన పరిచయాలతో కూడిన అభినందన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కత్తి కాంతారావు 'నాటకం' ఆవిష్కరణ



నాంపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో టీఎల్ కాంతారావు శత జయంతి సందర్భంగా భాస్కరుని సత్య జగదీష్ రచించిన కత్తి కాంతారావు (నాటకం) ఆవిష్కరణ సభ ఆదివారం మాసబ్ ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీలోని డాక్టర్ కేవీ.రమణాచార్య క్యాంపు కార్యాలయంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచార్య హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ విజ్ఞాన విశారద ఎస్.వి.రామారావు, ప్రముఖ రచయిత, దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కిన్నెర ఆర్ట్ థియేటర్ కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్షియర్ల బ్లాక్ మార్కెట్‌కు ప్రభుత్వం చెక్ పెట్టాలి



మాట్లాడుతున్న ఆటో డ్రైవర్ జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఆటోబ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న ఫైనాన్షియర్ల పట్ల ప్రభుత్వం, పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం వల్లే ఆటో బ్లాక్ మార్కెటింగ్ జోరుగా సాగుతుందని, దానిని అరికట్టాలని తెలంగాణ ఆటో డ్రైవర్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలు కేవలం నిరుపేదలు మాత్రమే నడుపుతున్నారని, మార్కెట్‌లో రెండున్నర లక్షల ధరచేసే కొత్త ఆటో రెండింతల ధరకు అమ్ముడుపోతుందన్నారు. ఆటోలు ఇంత బ్లాక్‌మార్కెట్ నడుస్తున్నా పోలీసులు కానీ, ప్రభుత్వం కానీ ఆటో ఫైనాన్షియర్లను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఆంజనేయులు, ఆజీమ్, అంజయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



చెన్నకేశవ స్వామి ఆలయంలో..

చాంద్రాయణగుట్ట: హనుమాన్ జయంతి సందర్భంగా చాంద్రాయణగుట్టలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జుర్కీ అనిల్‌కుమార్, సభ్యులు రవి రాహుల్, ప్రతాపాచార్యులు, జె.ప్రభాకర్, పల్లవి, సాయి, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయండి



గో పోషణలో పాల్గొన్న మురళి గాధే, వరకుమార్‌గుప్తా తదితరులు

అబిడ్స్: గో సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వాసవి క్లబ్ ఆఫ్ హైరాబాద్ పూర్వ అధ్యక్షుడు గాధే మురళి పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా గో ఉత్పత్తులను పెంచేందుకు, గోమాతను రక్షించేందుకు వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఆదివారం వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రీకళ హనుమాన్ ఆలయం వద్ద ఉన్న గోశాలలో గోమాత పోషణ కార్యక్రమం నిర్వహించారు. 10 టన్నుల కూరగాయలు, పండ్లు, గోవుదానం, బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాదే మురళి మాట్లాడుతూ.. గోవులను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత వహించాలన్నారు. వాసవిక్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా గోమాత పోషణ కార్యక్రమం చేపడుతూ.. గోవుల ఉత్పత్తికి, గోవుల సంరక్షణకు తమ క్లబ్ నిరంతరం సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు అమరీష్, వెంకటేష్, రవికుమార్, అశోక్ కుమార్, బొశెట్టి హరినాథ్, బాదం వెంకట కృష్ణ, డాక్టర్ రాజేంద్రకుమార్ ఎల్లూరి, ఐత కిశోర్, ముక్క కృష్ణాగుప్తా పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు భేష్



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, అనురాధ దేవి తదితరులు

గోల్కొండ: నిరుద్యోగులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలకు వెలకట్టలేమని గోల్కొండ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు అన్నారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారు గోల్కొండ బంజార దర్వాజ వద్ద గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బంజార దర్వాజ బస్తీ కమిటీ వారు ఐక్యంగా ఉండి నిరుద్యోగులు, స్థానిక మహిళల కోసం క్రమం తప్పకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల వారు సైతం తమ వద్దకు వచ్చి శిక్షణ పొందుతున్నారని, గోల్కొండ ప్రభుత్వ తెలు గు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైఎస్. అనురాధ దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్, యూనైటిడెట్ వే ఆఫ్ హైదరాబాద్ రేఖ, డైరెక్టర్ రాములు, కో–ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే వేడుకలు



గోల్కొండ: అమ్మను మించిన దైవము లేదని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘానికి చెందిన శ్రీకాంత్ ఛారి అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాల బజార్‌లో మదర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన తన తల్లితో పాటు పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురేష్ చారి తదితరులున్నారు.

హక్కుల సాధనకు కృషి



సంఘం సభ్యులతో కురకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: హక్కుల సాధనతో పాటు సంఘాన్ని బలోపేతం చేయుటకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘాలను ఏర్పాటు చేస్తామని ఎరుకల సంఘం రాష్ట్ర నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన ఎరుకల సంఘం సిద్దిపేట జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరుకల కులస్తుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని, సంఘంలో విద్యావంతులు ప్రధాన పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జంట నగరాలలో సంఘం బలీయంగా ఉందని, తెలంగాణ జిల్లాలో సైతం ప్రతి జిల్లాకు కమిటీలు వేస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ఎన్నో కులాల వారు ప్రభుత్వంతో పోరాడి హక్కులు సాధించవచ్చని, కుల సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలంతో పాటు నిధులు కేటాయించవచ్చన్నారు. ఎరుకల సంఘానికి కూడా జాగాను కేటాయించారని సంఘం సభ్యులంతా కలిసి అత్యాధునిక వసతులతో నిర్మించుకుందామని ఆయన అన్నారు. ప్రభుత్వం నుండి తమకు కులస్తులకు అందుతున్న పథకాల లబ్ధి పొందాలని, దీని కోసం సంఘం వారు కుల సభ్యులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట్ హడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి సోమయ్య, కోశాధికారి కనకయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలను ఇంటింటికీ అందిస్తాం



కార్యకర్తలతో సమావేశమైన ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధిని చూసి అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఆదివారం బేగంబజార్, చుడిబజార్ ప్రాంతంలో యాదవ్ సమాజ్ నాయకులు కార్యకర్తల వద్దకే ఆయన వెళ్లి వారితో సమావేశాలు చేశారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తెస్తే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పూనంచంద్ యాదవ్ ధరమ్‌రాజ్ యాదవ్, అర్జున్ యాదవ్, లాల్‌చంద్ యాదవ్, అజయ్ యాదవ్, విశాల్ యాదవ్, కపిల్ యాదవ్, శంకర్ సింగ్ లోధ్, పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ పాల్గొన్నారు.

నేడు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభం

జియాగూడ: ఈనెల 15న కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభోత్సవం ఉంటుందని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఉదయం నూతన భవనాన్ని ప్రారంభించడానికి ముఖ్యఅతిథులుగా హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, మీర్జా రహమద్ బేగ్, ఎంఎస్.ప్రభాకర్‌రావు, ప్రియా ఉల్ హసన్, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ ఓలేటి దామోదర్‌గుప్తా, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ రతన్, ప్రత్యేక ఆహ్వానితులుగా డీజీపీ అంజనీకుమార్, ప్రిన్సిపాల్ సెక్రటరి జితేందర్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

గోల్కొండ: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని పురస్కరించుకుని షేక్‌పేట్ నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో షేక్‌పేట్ నాలా వద్ద ఈ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్ ఖాన్, బాలరాజ్, యాది, మక్బుల్, రవి, వెంకటేష్ తదితరులున్నారు.

అభినందన

అఫ్జల్‌గంజ్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడం అభినందనీయమని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. 10 కి 10 శాతం మార్కులు సాధించిన వినీత్ గుప్తాను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

ముగ్గురిపై పీడీ యాక్టు నమోదు

అఫ్జల్‌గంజ్: అరకు నుంచి నగరం మీదుగా ముంబైకి గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను శనివారం రాత్రి అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసి వారిపై పీడీ యాక్టును నమోదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. ముంబైకి చెందిన ప్రధాన నిందితుడు అలీసాగర్ షర్ఫుద్దీన్ రామ్‌పూర్‌వాల (34), బిల్కిస్ మొహ్మద్ సులేమాన్ (45), ముర్తుజా షేక్ అలియాస్ శైబాజ్ (45)లపై ముంబై, తెలంగాణలోని కొత్తగూడెం జిల్లాల్లో గతంలో డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. ఈనెల 10న వీరు అరకు నుంచి ఇన్నోవా కారులో 110 కిలోల గంజాయిని నగరానికి తీసుకువచ్చారు. జాంబాగ్‌లోని రంగ్ మహల్ టికారాం కార్ పార్కింగ్ వద్ద నుంచి ముంబైకి తరలించేందుకు యత్నించగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. 110 కిలోల గంజాయి, రూ.1.5 లక్షల నగదు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో నమోదై ఉన్న కేసులను పరిశీలించిన పోలీసులు ముగ్గురిపై పీడీ యాక్టును నమోదు చేసినట్లు తెలిపారు.